ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

బుధవారం 26 ఫిబ్రవరి 2025



శ్రీకాకుళం కల్చరల్: జీవేశ్వర ఆలయంలో నిలువెత్తు ఈశ్వరుడు

హరహర మహాదేవ

- శివరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

మహా శివరాత్రి పర్వదిన వేడుకలకు శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. తూర్పు కనుమల్లోని మహేంద్రగిరుల యాత్ర మంగళవారం ప్రారంభమైంది. అధిక సంఖ్యలో భక్తులు కాలినడకన మహేంద్రగిరులకు చేరుకున్నారు. అక్కడి శివ లింగాలకు పూజలు చేశారు. అలాగే శ్రీకాకుళంలో ఉమారుద్ర కోటేశ్వరాలయం, ఉమాజఠలేశ్వర, జీవేశ్వర తదితర ఆలయాలను సుందరంగా అలంకరించారు. జలుమూరు మండలం శ్రీముఖలింగం, టెక్కలి మండలం రావివలస ఎండల మల్లన్న ఆలయంలో కూడా భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు ఏర్పాట్లు చేశారు.

6లో



శ్రీకాకుళం కల్చరల్: ఉమాజఠలేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ

పక్కాగా ఏర్పాట్లు

- మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాలకు భక్తులకు ఇబ్బంది లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దేవదాయశాఖ అధికారులకు ఆదేశించారు. మంగళవారం దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, ఈవో జి.గురునాథరావుతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. 'రావివలస ఎండలమల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని క్యూలైన్లు, నీడ సౌకర్యం, తాగునీరు, మజ్జిగ సరఫరా, బందోబస్తు నిర్వహణకు పోలీసుల సహాయక చర్యలు తీసుకోవాలి. పోలీస్, దేవదాయశాఖ, గ్రామపంచాయతీ, విద్యుత్‌శాఖ అధికారులు సమన్వయంగా పనిచేసి శివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయాల'ని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.



నరసన్నపేటలో చికెన్ మేళా వద్ద క్యూ కట్టిన ప్రజలు

ఎగ్‌బడిన.. మాంసప్రియులు

నరసన్నపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధిపై ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించేందుకు మంగళవారం నరసన్నపేటలోని మారుతీనగర్ జంక్షన్ వద్ద ఓ కంపెనీ ఆధ్వర్యంలో ఉచిత చికెన్ మేళా నిర్వహించారు. బర్డ్‌ఫ్లూ పై ప్రజల్లో అపోహలను తొలగించేందుకు 200 కేజీల చికెన్‌తో పలు రకాలు వంటకాలు, అలాగే 2వేలు ఉడికించిన గుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. వీటి కోసం జనం ఎగబడ్డారు. అధిక సంఖ్యలో ప్రజలు రావడంతో నిర్వాహకులు వారిని కట్టడి చేయలేకపోయారు. ఈ క్రమంలో తోపులాట జరిగి టెంట్లు కూడా పడిపోయాయి. కాగా.. బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్, గుడ్లు కొనేందుకు వెనుకంజ వేస్తున్న ప్రజలు.. మేళాకు మాత్రం పెద్ద ఎత్తున రావడం చర్చనీయాంశమైంది.



తోపులాటలో కూలిన టెంట్

సాంకేతికతతో సమస్యల పరిష్కారం

- పీఎం సూర్యఘర్‌ను మిషన్ మోడ్‌లో చేపట్టాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కన జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, ఉపాధిహామీ, ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన, ఐసీడీఎస్, జీఎస్‌డబ్ల్యూఎస్, పారిశుధ్యం, వైద్యారోగ్యం, పీజీఆర్ఎస్ వంటి అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక.. 'మీ-కోసం' ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలి. పరిష్కరించబడిన ఫిర్యాదులపై ఆడిటింగ్ నిర్వహించాలి. ఏపీ సేవ, మీసేవా, పీజీఆర్ఎస్ దరఖాస్తుల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమీక్ష చేపట్టాం. ప్రజలకు మెరుగైన సేవలందించడానికి సాంకేతికతను వినియోగించుకోవాలి. జిల్లాలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను మిషన్ మోడ్‌లో నిర్వహించాల'ని ఆదేశించారు. అలాగే రెవెన్యూ సదస్సులు, రీసర్వే, ఫిర్యాదుల (మిగతా 8వ పేజీలో..)

వీడని మత్తు

- జిల్లాలో ఆగని గంజాయి అక్రమ రవాణా
- ఒడిశా టు చెన్నై.. బెంగళూరు వయా పలాస
- పలాస రైల్వే స్టేషన్‌రోడ్డులో పట్టుబడిన ఒడిశా ముఠా
- ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, సోంపేట మండలాల్లో కూడా నిల్వల స్వాధీనం
- మొత్తంగా 11 మంది అరెస్టు

పలాస, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తు.. జిల్లాను వీడడం లేదు. గంజాయి నిర్మూలనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి.. విస్తృతంగా సోదాలు చేస్తున్నారు. ఈ క్రమంలో భారీగా గంజాయి నిల్వలు పట్టుబడుతున్నాయి. మన రాష్ట్ర పోలీసులు అనుమానిస్తున్నట్టుగానే ఒడిశా నుంచి భారీ స్థాయిలో గంజాయి రవాణా జరుగుతోంది. ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని పలాస, ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్లకు చేరవేసి అక్కడ నుంచి చెన్నై, బెంగుళూరు వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. పోలీసులు తనిఖీల్లో మంగళవారం ఒక్కరోజే పలాస, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, సోంపేట మండలాల్లో 11 మంది అరెస్టు అయ్యారు. వారి నుంచి గంజాయితోపాటు ద్విచక్ర వాహనాలు, ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు వెల్లడించారు. గంజాయి నివారణపై పూర్తిస్థాయి దృష్టి పెట్టామని, రైల్వేస్టేషన్, బస్టాండు వంటి ప్రాంతాల్లో నిఘా పెంచామని డీఎస్పీ తెలిపారు. గంజాయి సేవించినా, రవాణా చేసినా నేరమని, వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

పలాసలో 40 కిలోలు..

పలాస రైల్వేస్టేషన్‌రోడ్డులో మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తన బృందంతో (మిగతా 6వ పేజీలో..)



పలాస : రైల్వేస్టేషన్ రోడ్డు పట్టుబడిన గంజాయిని తూకం వేయిస్తున్న సీఐ సూర్యనారాయణ



వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట అప్పారావు, పోలీసులకు పట్టుబడిన గంజాయి నిందితులు

వజ్రపుకొత్తూరులో 18 కిలోలు..

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలంలో రెండుచోట్ల 18 కిలోల 280 గ్రాముల గంజాయి పట్టుబడిందని కాశీ బుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. మంగళ వారం వజ్రపుకొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో డీఎస్పీ మాట్లాడారు. 'సోమవారం మధ్యాహ్నం బెండి గేటు జంక్షన్ వద్ద గంజాయి రవాణాకు పాల్పడుతున్న ఒడిశా రాష్ట్రం గంజాంకు చెందిన మనయ్‌సబర్, ప్రశాంతి మల్లిక్‌తోపాటు వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవుకు చెందిన బైనపల్లి షణ్ముఖను అరెస్టు చేశాం. వారి నుంచి 8.280 కిలోల గంజాయి, ఒక ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నాం. అదేరోజు పూండి రైల్వేస్టేషన్‌లో 10 కిలోల గంజాయిని రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రం గంజాంకు చెందిన ప్రశాంత్ కుమార్ సాహు, భారతీసాహు, ముంబైకి చెందిన నవాబ్ అహ్మద్‌ను అరెస్టు చేశాం. వారి వద్ద 10 కిలోల గంజాయితో పాటు రెండు ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నాం. నిందితులను మంగళవారం కోర్టులో హాజరు పరిచామ'ని డీఎస్పీ వెల్లడించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సీఐ డి.తిరుపతి రావు, ఎస్ఐ బి.నిహార్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు: డీఎస్పీ

జిల్లాలో గంజాయి రవాణా అడ్డుకునేందుకు డీఐజీ గోపినాథ్ జెట్టి, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. తాత్కాలిక ఆనందం కోసం యువత.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు. 'స్మగ్లర్లు యువతకు డబ్బు ఆశ చూపి గంజాయి రవాణా చేయిస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. నిరుద్యోగ యువతే స్మగ్లర్లు టార్గెట్ చేస్తు న్నారు. యువత అప్రమత్తంగా ఉండాలి. మత్తు పదార్థాలతో పట్టుబడితే కఠిన కేసులు నమోదవుతాయి. వారి జీవితాలు నాశమవుతాయి. కుటుంబాలు కూడా వీధిన పడతాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని యువత భవిష్యత్ కాపాడుకోవాలి' అని డీఎస్పీ తెలిపారు. గంజాయి రవాణా విషయం తెలిస్తే.. పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు. కాగా వజ్రపుకొత్తూరు మండలానికి కూడా గంజాయి సంస్కృతి పాకడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.


ఇచ్ఛాపురంలో 10 కేజీలు..

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి మహారాష్ట్రకు అక్రమంగా గంజాయిని తరలించేందుకు ప్రయత్నించిన ఇద్దరు నిందుతులను అరెస్ట్ చేశామని కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. మహారాష్ట్ర రాష్ట్రం జలన జిల్లా పెవ గ్రామానికి చెందిన రవిరామదోత్రే, పర్బాని జిల్లా జింతూరు గ్రామానికి చెందిన విశ్వనాథ్ తుకారం ఖండేకర్.. ఒడిశాలో పది కిలోలు గంజాయి కొనుగోలు చేసి మంగళవారం ఇచ్ఛాపురం చేరుకున్నారు. ఇక్కడ నుంచి రైలులో మహారాష్ట వెళ్లి అక్కడ వ్యాపారి రాహుల్ గవాజేకు గంజాయి అందించాలని భావించారు. ఈమేరకు ఎం.తోటూరు మీదుగా రైల్వేస్టేషన్‌కు వారిద్దరూ వెళ్తుండగా రూరల్ ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బందికి పట్టుబడ్డారు. వారి నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ చిన్నమనాయుడు తెలిపారు.

సోంపేటలో 6 కిలోలు..

సోంపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సోంపేటలో గంజాయి తరలిస్తున్న ప్రధాన్ రాజేష్‌ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన సుబ్రహ్మణ్యం 3 ప్యాకెట్లు(6కిలోలు) గంజాయిని ముంబై తరలిస్తున్నట్టు సమాచారం అందింది. మంగళవారం మధ్యాహ్నం సోంపేట బస్‌స్టేషన్‌లో ఆయనను అరెస్టు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ మంగరాజు, ఎస్ఐ లవరాజు పాల్గొన్నారు.

మిర్చి రైతుకు కన్నీరు



మిర్చి.. ఒకప్పుడు గుంటూరు తర్వాత సిక్కోలులో విస్తారంగా సాగయ్యేది. ఇక్కడ నుంచే ఢిల్లీ, కాన్పూర్ తదితర ప్రాంతాలకు మిర్చి ఎగుమతి అయ్యేది. ఏటా ఈ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు కళకళలాడేవి. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించక.. ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. మరోవైపు గిట్టుబాటు ధర కూడా లేకపోవడంతో మిర్చి రైతులకు కన్నీరే మిగులుతోంది. దీంతో మిర్చి సాగుపై రైతుల్లో ఆసక్తి సన్నగిల్లింది.


- జిల్లాలో తగ్గిన సాగు విస్తీర్ణం
- దిగుబడిపై మంచు ప్రభావం
- ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మిర్చి సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. ఒకప్పుడు ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు, గార, పోలాకి, నరసన్నపేట తదితర మండలాల్లో వందలాది ఎకరాల్లో మిర్చి సాగయ్యేది. గుంటూరు తర్వాత స్థానంలో సిక్కోలు ఉండేది. ఇక్కడి నుంచే మిర్చి పంట ఢిల్లీ, కాన్పూర్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. కాగా.. జిల్లాలో క్రమేపీ మిర్చి సాగు విస్తీర్ణం తగ్గడంతో గుంటూరు వంటి ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొనే దుస్థితి ఏర్పడింది. స్థానిక ప్రజల అవసరాల మేరకు కూడా సాగు చేపట్టకపోవడంతో వ్యాపారాలు కూడా సన్నగిల్లాయి. సాధారణంగా మిర్చి దిగుబడి జనవరి నెలలోనే రావల్సి ఉంది. ఈ ఏడాది ఇప్పటికీ మిర్చి దిగుబడి అంతంతమాత్రంగా ఉంది. విపరీతమైన మంచు ప్రభావంతో దిగుబడి తగ్గింది. ఉదయం 9 గంటల వరకూ మంచు కురవడంతో పంటకు నష్టం వాటిల్లింది. మరోవైపు వివిధ రకాల తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గడమే కాకుండా, ఆలస్యంగా పంట చేతికి వస్తున్నట్టు రైతులు (మిగతా 6వ పేజీలో..)



చిలకపాలెంలోని కొనుగోలు కేంద్రంలో మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

సాగుకు ఇబ్బంది



కొన్నేళ్లుగా మిర్చిని సాగు చేస్తున్నాం. మిర్చి సాగు చాలా ఖర్చుతో కూడుకున్నపని. అకాల వర్షాలు, తెగుళ్ల కారణంగా ఈ ఏడాది ఇప్పటికీ పంట చేతికి రాలేదు. ఎకరా పొలంలో మిర్చి సాగునకు వేలాది రూపాయలు ఖర్చు చేసినా.. పంట వస్తుందా లేదో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఏటా మిర్చి సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది.

- తంగి మల్లేశ్వరరావు, రైతు, తంగివానిపేట

పదేళ్లుగా తగ్గుతూనే..



చిలకపాలెం కేంద్రంగా నాలుగు దశాబ్దాలుగా మిర్చి వ్యాపారాన్ని చేస్తున్నాం. ఒకప్పుడు ఇక్కడి నుంచే ఢిల్లీ, కాన్పూర్ తదితర ప్రాంతాలకు మిర్చి ఎగుమతయ్యేది. సుమారు పదేళ్లుగా మిర్చి సాగు బాగా తగ్గుతూనే ఉంది.

- అట్ల సత్యానందం, ట్రేడర్, చిలకపాలెం

పీఎం కిసాన్ నిధులు జమ

- జిల్లాలో 2.32లక్షల మంది రైతులకు రూ.47.56కోట్లు

నరసన్నపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధులను కేంద్ర ప్రభుత్వం సోమవారం నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది. కేంద్రం ఏటా రూ.2వేల వంతున మూడు విడతలుగా రూ.6వేలను దీని కింద అందజేస్తోంది. ఈ పథకాన్ని ప్రవేశపెట్టి ఆరేళ్లు పూర్తయింది. 19వ విడత పీఎం సమ్మాన్ పథకంలో భాగంగా జిల్లాలో మొత్తం 2,32,881 మంది రైతులకు రూ.47.56 కోట్లు విడుదలైంది. సోమ, మంగళవారాల్లో రైతుల ఖాతాల్లో నగదు జమకావడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- ముగిసిన ప్రచారం
- అంతటా నిషేధ ఆజ్ఞలు

7లో


విద్యుత్ వెలుగుల్లో ఉమారుద్ర కోటేశ్వర ఆలయం

హరహర మహాదేవ

జిల్లాలోని శైవక్షేత్రాలు శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. రాత్రి నుంచే విద్యుద్దీప కాంతుల్లో వెలుగులీనుతున్నాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీముఖలింగేశ్వరుడి సన్నిధిలో మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఇక్కడ చక్రతీర్థ స్నానఘట్టానికి లక్షలాదిమంది తరలి వస్తారు. ఇక రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో కూడా ఉత్సవాలు మూడు రోజులు వైభవంగా నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ఆయా క్షేత్రాలకు బస్సులను నడుపుతున్నారు.

శివరాత్రి వేడుకలకు ముస్తాబైన క్షేత్రాలు

ఉమారుద్ర కోటేశ్వరుడి సన్నిధిలో..



శ్రీకాకుళం కల్చరల్ ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నాగావళి నది ఒడ్డున ఉన్న ఉమారుద్రకోటేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శివరాత్రి నాడు లక్ష బిల్వార్చన, కుంకుమార్చన పూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే మహానందీశ్వర వాహనంపై తిరువీధి నిర్వహించడానికి పల్లకిలు సిద్ధం చేశారు. ఇక్కడ 400 ఏళ్ల రావిచెట్టు ఉంది. వినాయకుడి గుడి ఈ చెట్టు వద్దే ప్రతిష్ఠించారు. స్వామి దర్శనానికి ముందు ఈ చెట్టు, వినాయకుడిని భక్తులు దర్శనం చేసుకుంటారు.

శ్రీముఖలింగేశ్వరుడి వేడుకకు వేళాయే

జలుమూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వంశధార నదీతీరాన వెలిసిన శ్రీముఖలింగం క్షేత్రం శివరాత్రి వేడుకకు సన్నద్ధమైంది. శివుడు ముఖాకృతి రూపంలో భక్తులకు దర్శనమిస్తున్న ఏకైక ఆలయం శ్రీముఖలింగమని చెబుతారు. ఇది శ్రీకాకుళానికి 50 కి.మీ దూరంలో జలుమూరు మండలంలో వెలిసింది. కాశీలో లింగం, గంగలో స్నానం, శ్రీశైలంలో శిఖరం, శ్రీముఖలింగంలో ముఖదర్శనం చేస్తే మోక్షం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. ఇక్కడ లభించిన శాసనాల ఆధారంగా క్రీ.శ.720 నుంచి 1450 వరకు గంగవంశీకులు ఈ ఆలయం నిర్మాణం ప్రారంభమైంది. క్రీ.శ.14వ శతాబ్దంలో శిథిలమైన ఆలయాన్ని పర్లాకిమిడి ప్రభువు శ్రీవిష్ణువర్దన మధుకర్ల గజపతి పునరుద్ధరించినట్లు తెలుస్తోంది. ఆలయంపై అద్భుత శిల్పాలు మనకు శ్రీముఖలింగంలో ముక్కోణం ఆకారంలో మూడు ఆలయాలు ఉన్నాయి. ప్రధాన ఆలయం మధుకేశ్వరాలయం. దీనికి అభిముఖంగా భీమేశ్వర ఆలయం వున్నది. ఈ రెండింటికి కాస్తదూరంగా ఊరి ప్రారంభంలో సోమేశ్వరాలయం ఉంది.


శ్రీముఖలింగేశ్వరుడు

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

ఇక్కడ బుధవారం నుంచి 28వ తేదీ వరకు మూడు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి నాడు జాగారం, 27న గురువారం పడియా, 28న శుక్రవారం వంశధార నదిలో స్వామివారి చక్రతీర్థస్నానాలు జరగనున్నాయి. చక్రతీర్థ స్నానాలకు లక్షలాది మంది భక్తులు వస్తారు.

పలాస మండలంలో..

పలాసరూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాదేవపురం స్వయంభూలింగేశ్వరుడు, కేదారిపురంలో వెలసిన కేదారేశ్వరుడు, తర్లాకోటలో వెలసిన నీలకంఠేశ్వరుడు, లొద్దభద్ర భూతఈశ్వరుడు, సున్నాడ గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వరుడు, మహాదేవపురం గ్రామశివారులో వెలసిన దక్షిణేశ్వరుడు, బొడ్డపాడు, మాకన్నపల్లి గ్రామాల్లో వెలసిన రుద్రేశ్వరుడి ఆలయాలు శివరాత్రి వేడుకకు సిద్ధమయ్యాయి. భూలింగేశ్వరుడు ఆలయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.


మహాదేవపురం స్వయంభూలింగేశ్వరుడి ఆలయం


బెండి నందికేశ్వరాలయం

శివసాగర్ తీరంలో..

వజ్రపుకొత్తూరు, పిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెండి, నందికేశ్వర ఆలయం, శివసాగర్‌తీరంలో వెలిసిన శ్రీనీలకంఠేశ్వర ఆలయాల్లో బుధవారం శివరాత్రి పూజలకు సిద్ధమయ్యాయి. బెండి నందికేశ్వర ఆలయం 11వ శతాబ్దంలో నిర్మించినట్లు చెబుతున్నారు. శ్రీముఖలింగేశ్వర ఆలయాలు.. బెండి నందికేశ్వర ఆలయం పోలిఉండడం విశేషం. కాశీబుగ్గ 10 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. బస్సులు, ఆటోల వంటి రవాణా సదుపాయం ఉంది, శివసాగర్ తీరంలోని నీలంఠేశ్వర ఆలయానికి 200 ఏళ్ల చరిత్ర ఉంది, ఈ ఆలయంలో పూజలు చేస్తే సంతానం ప్రాప్తిస్తుందని నమ్మకం. దీంతో నూతన దంపతులతో పాటు పిల్లల్లేని వారు ఆలయంలో పూజలు చేస్తూంటారు.



ఎండల మల్లికార్జునుడి సన్నిధిలో..

టెక్కలి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రావివలసలోని ఎండల మల్లికార్జున స్వామి ఆలయం శివరాత్రికి ముస్తాబయింది. ఈవో జి.గురునాథరావు ఆధ్వర్యంలో ఉత్సవాలు మూడురోజుల పాటు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. 26న మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 9గంటల నుంచి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవం, 27న విభూదితో భస్మాలంకరణ, 28న స్వామివారి తిరువీధి, సీతకోనేరులో చక్రతీర్థ స్నానం ఉంటాయి. 26న సత్యహరిశ్చంద్ర, రామాంజనేయ యుద్ధం నాటక ప్రదర్శనలు ఉన్నాయి.

ఎలా చేరుకోవాలంటే..

టెక్కలికి 5 కిలోమీటర్ల దూరంలోని రావివలస చేరుకునేందుకు బస్సులు, ఆటోల సౌకర్యం ఉంది. నౌపడా రైల్వేస్టేషన్ నుంచి, టెక్కలి రైల్వేస్టేషన్ నుంచి కూడా రావివలసకు చేరుకోవచ్చు. జిల్లా కేంద్రానికి 55 కిలోమీటర్ల దూరంలో రావివలస ఉంది.



మహేంద్రగిరికి యాత్ర

హరిపురం, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం వేకువజాము నుంచే భక్తులు మహేంద్ర గిరులకు కాలినడకన యాత్ర ప్రారంభించారు. బుధవారం వేకువ జామున అక్కడికి చేరుకుని సూర్యోధయాన్ని వీక్షిస్తారు. వేలాది మంది ఇప్పటికే పంచాక్షరికి చేరుకుని ఆలయాలను సందర్శిస్తున్నారు. భీముని ఆలయం, కుంతీకోవెల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు పలాస నుంచి మందస మండలం సాభకోట వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. కాలినడక దారిలో సింగుపురం వద్ద వైద్యాధికారులు శిబిరాన్ని ఏర్పాటు చేశారు.


శ్రీకాకుళం సమీపంలో నాగావళి నదిలో మురుగునీటి ప్రవాహం

నాగావళి వంతెన సమీపంలో చెత్త డంప్

శివశివా.. పుణ్య స్నానమెలా?

ఉమారుద్ర కోటేశ్వరుడి చెంత మురికికూపంగా నాగావళి నది

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వేలమంది రైతుల సాగుభూములకు ఆధారమై.. లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేస్తూ... అంతే స్థాయిలో జనాల దాహార్తిని తీర్చుతున్న నాగావళి నది ఇది. నాగావళిని కాపాడాలని పర్యావరణ ప్రేమికులు ఎంతగా కోరుతున్నా.. స్పందించని అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమీ చిత్రాలు. ప్రజలు నిత్యం విడిచిపెడుతున్న వ్యర్థ జలాలతో నాగావళి మురుగునీటి కాలువకంటే అధ్వానంగా మారింది. నగరంలోని వంతెనల చెంత వివిధ ప్రాంతాల్లోని చెత్తను కొండల్లా కుప్పలు పెడుతుండడంతో అది కూడా నీటిలోనే కలుస్తోంది. దీంతో నీరు విషతుల్యం అవుతోంది. నేడు శివరాత్రి పర్వదినం. ఉమారుద్ర కోటేశ్వరాలయానికి వచ్చే భక్తులు నాగావళి నదిలో స్నానమాచరిస్తారు. ఆతర్వాతే స్వామి దర్శనానికి వెళ్తారు. ఇక్కడ స్నానమాచరిస్తే పుణ్యం సంగతేమోగానీ రోగాలబారిన పడడకం ఖాయమని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివరాత్రి, కార్తీకమాసం సమయములో కూడా అధికారులు ఈ నదిపై దృష్టి పెట్టి శుభ్రం చేద్దామన్న శ్రద్ధ కూడా లేదని విమర్శిస్తున్నారు. ఈ నది మురికినీటిలో పందులు, కుక్కలు స్వైర్య విహారం చేస్తుంటాయి. ఆలయంలో అభిషేకాలు నిర్వహించిన తరువాత పాలకవర్గు, వ్యర్థ సామగ్రి కూడా ఈ మురికి నీటిలో వేస్తుంటారు.

వీడని మత్తు

(ఐదో పేజీ తరువాయి)

సోదాలు చేయగా.. ఇద్దరు వ్యక్తులు మోటారు వాహనాలపై లగేజీ బ్యాగులతో అనుమానస్పదంగా కనిపించారు. వారిని ప్రశ్నించడంతో గంజాయి రవాణా విషయం బయట పడింది. వారి వద్ద 40.026 కిలోల గంజాయి పోలీసులకు పట్టుబడింది. ఒడిశా రాష్ట్రం రాయఘడ జిల్లా జిరా గ్రామానికి చెందిన నరేంద్రలిమ, గజపతి జిల్లా సుందరడంగ్ గ్రామానికి చెందిన లితురథ్, జిల్లు, మోహనబ్లాక్‌కు చెందిన బబులాలు ముఠాగా ఏర్పడి గంజాయి రవాణా చేస్తుంటారు. ఇందులో బబులా ఉదయగిరి, మోహనబ్లాక్‌ల్లో గంజాయి పండించడంతో పాటు రవాణా కూడా చేస్తుంటాడు. ఇతని స్నేహితుడు జిల్లుకు గంజాయి సరఫరా చేస్తూ.. పలాస రైల్వేస్టేషన్ వద్ద బ్రోకర్లకు అప్పగిస్తుంటారు. చెన్నై, బెంగుళూరు నుంచి భారీ గంజాయి ఆర్డర్ రావడంతో మరో ఇద్దరు వ్యక్తుల సహకారం తీసుకొని పలాస గంజాయి తరలించాలని బబులా చెప్పడంతో జిల్లు తన స్నేహితులైన నరేంద్రలిమ, లితురథ్‌లకు గంజాయి రవాణా పని అప్పగించాడు. వారు ద్విచక్ర వాహనాలపై 40.026 కిలోల గంజాయిని మొత్తం 19 ప్యాకెట్లుగా కట్టి బ్యాగుల్లో ఎవరికి అనుమానం రాకుండా పలాస తరలించారు. పోలీసులు సోదాలు చేయడంతో నరేంద్రలిమ, లితురథ్ పట్టుబడ్డారు. వారితో వచ్చిన జిల్లు పరారీ అయ్యాడు. గంజాయి పండిస్తు రవాణా చేస్తున్న బబులా కోసం పోలీసులు గాలిస్తున్నారు. పది రోజుల వ్యవధిలో పలాస రైల్వే స్టేషన్ వద్ద గంజాయి ముఠాను పట్టుకోవడం ఇది రెండోసారి కావడం గమనార్హం.

మిర్చి రైతుకు.. కన్నీరు

(ఐదో పేజీ తరువాయి)

చెబుతున్నారు. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసిన అకాల వర్షాల కారణంగా మిర్చి సాగులో జాప్యమైనట్టు ఉద్యానశాఖాధికారులు అభిప్రాయ పడుతున్నారు. జిల్లాలోని రణస్థలం, పైడిభీమవరం లావేరు, వెంకటాపురం తదితర ప్రాంతాల్లో కూరాకుల మిర్చి సాగు చేస్తున్నారు. గార, లబ్బోడిపేట, ఇప్పిలి, కొయ్యానపేట, పోలాకి, వెదుళ్లవలస, డోల, లంకపేట, సుగ్గు అగ్రహారం, శాలిహుండాం, కళింగపట్నం, తదితర ప్రాంతాల్లో సారూ మిర్చి పండిస్తున్నారు. నరసన్నపేట ప్రాంతంలో పచ్చి మిర్చి సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇక్కడి నుంచి పచ్చిమిర్చి విశాఖపట్నం, అనకాపల్లి, రాజమండ్రి తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. గుంటూరులో మిర్చి కిలో రూ.80 నుంచి రూ. 90వరకు విక్రయిస్తున్నారు. దీంతో జిల్లాలో కూడా ఆ ప్రభావం పడి ధరలు తగ్గాయని రైతులు లబోదిబోమంటున్నారు. గతేడాది కూరాకుల మిర్చి కిలో రూ.200 ఉండగా.. ఈ ఏడాది రూ.140కి ధర పడిపోయింది. అలాగే పులికట్ రకం గతేడాది కిలో రూ.160 ఉండగా.. ప్రస్తుతం రూ.90కి మించి అమ్మలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు.

కారణాలెన్నో..: మిగిలిన పంటలతో పోలిస్తే మిర్చి సాగులో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పంట చేతికి వచ్చేవరకు శ్రమతో కూడిన పని. ధరలు కూడా నిలకడగా ఉండవు. మరోవైపు మంచు, తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గుతుంది. దీంతో మిర్చి సాగుపై రైతుల్లో ఆసక్తి సన్నగిల్లింది. దీని స్థానంలో కూరగాయలు, పుచ్చకాయలు, మొక్కజొన్న, పత్తి పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. ఉదాహరణకు లావేరు, రణస్థలం మండలాల్లో గతేడాది వరకు మిర్చి సాగు చేసే రైతులు.. ప్రస్తుతం సుమారు 200 ఎకరాల్లో పుచ్చకాయలు పండిస్తున్నారు.

- క్రిమిసంహారక మందులు, పురుగుల మందుల వినియోగంతో మిర్చి పంట నాణ్యత బాగా తగ్గుతోంది. ఈ కారణంగా కోల్డ్‌స్టోరేజీలో నిల్వకు పనికిరాకుండా ఉంది. నిల్వ ఉంచితే మిర్చి రంగు మారిపోతోంది. దీనివల్ల ఈ ప్రాంతంలో నిల్వ చేసేందుకు ట్రేడర్లు కూడా ఇబ్బంది పడుతున్నారు. అలాగే దిగుబడి తగ్గడం.. ఎగుమతికి అవకాశం లేకపోవడంతో చిలకపాలెం, పొందూరు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు వెలవెలబోతున్నాయి.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌వైకే ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి వై.పోలినాయుడు, పీవో ఆర్.శ్రీనివాస పాత్రో, ఎంసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న సత్యవతి

శ్రీకాకుళం రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మట్టి నమూనా పరీక్షలతో పొలంలో భూసారాన్ని అంచనా వేసి.. రైతులు అధిక పంట లాభాలు పొందవచ్చునని భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు జి.సత్యవతి పేర్కొన్నారు. ఈ మేరకు గూడెం గ్రామంలో రైతులకు మట్టి నమూనా పరీక్షలపై అవగాహప కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.ఉషారాణి, దివ్య, విఏఏ నిఖిల తదితరులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య సేవలు

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్-2లో సహాయ మిత్ర సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ ప్రారంభించారు. మెడికవర్, జెమ్స్ ఆసుపత్రులు, శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్‌తో కలిసి ఈ శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 300 మంది విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, ఎఫ్‌వో వాసు, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ గేదెల రవి, క్యాంపస్ -2 ఇన్‌ఛార్జి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల జేఏసీ చైర్మన్‌గా పురుషోత్తంనాయుడు


జేఏసీ నాయకులతో పురుషోత్తం నాయుడు

అరసవల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ చైర్మన్‌గా జిల్లాకు చెందిన చౌదరి పురుషోత్తం నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్‌గా పురుషోత్తం నాయుడు, కార్యదర్శిగా సతీష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 4 లక్షల మంది సభ్యులుగా గల జేఏసీ ప్రయోజనాల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఆదిత్యాలయానికి విరాళంగా జనరేటర్

అరసవల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని శ్రీకాకుళం నగరానికి చెందిన పొట్నూరు షణ్ముఖరావు మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయానికి రూ.1.30లక్షల విలువ చేసే జనరేటర్‌ను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో వై.భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, అర్చకులు నేతింటి హరిబాబు పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం చూపండి


తహసీల్దార్‌కు సమస్యలు వివరిస్తున్న నాయకులు

జి.సిగడాం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టీడీపీ, బీజేపీ మండల శాఖాధ్యక్షులు కుమరాపు రవి కుమార్, పైల విష్ణు మూర్తి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ దృష్టికి భూసమస్యలను తీసుకువెళ్లారు. రీ- సర్వేలో తప్పులను సరిచేయటంతో పాటు రైతులు రెవెన్యూ సదస్సులలో పెట్టుకున్న వినతులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాని వారు కోరారు. అందుకు స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ రీ-సర్వేలో సిబ్బందితో సరి చేయిస్తానని చెప్పారుడ.

అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ

ఆమదాలవలస, ఫిబ్రవరి 25 (ఆంధ్ర జ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల అభ్యసనాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీడీపీవో అనురాధ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ తయారీపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గెడ్డాపు రాజేంద్రకుమార్, సూపర్‌వైజర్లు లక్ష్మీబాయి, లీలారాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


చైతన్యకు స్వాగతం పలుకుతున్న జేసీఐ సభ్యులు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని నెల్లూరు జిల్లాకు చెందిన చైతన్య అన్నారు. మొక్కల ఆవశ్యకతను తెలియజేసేందుకు నెల్లూరు నుంచి ఇచ్ఛాపురం వరకు ఆయన సైకిల్ యాత్ర చేపట్టారు. మంగళవారం ఇచ్ఛాపురం చేరుకున్న చైతన్యకు స్థానిక జేసీఐ అధ్యక్షులు కాళ్ల జయదేవ్ ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో 50 మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జేసీఐ అధ్యక్షులు, టీడీపీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కాళ్ల జయదేవ్, సభ్యులు డాక్టర్ మోహన్, వెంకటేష్, షణ్ముఖరావు, స్వరూప్, రాజ్‌కుమార్, సంతోష్ కుమార్, ప్రేమ్ సాయి, మల్లేష్, డాక్టర్ మట్ట శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు వేళాయె..


ఇచ్ఛాపురం: చిదంబరేశ్వర ఆలయం వద్ద క్యూలైన్లు..


సోంపేట: కాశీ విశ్వేశ్వరాలయంలో విద్యుత్ వెలుగులు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణ పరిధిలో గల అన్ని శివాలయాలను నిర్వాహకులు అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని చిదంబరేశ్వర, పాతాళ సిద్దేశ్వర, రామలింగేశ్వర ఆలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. చిదంబరేశ్వర ఆలయం సమీపంలో గల కోనేరులో నిర్మించిన శివుని విగ్రహం వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. కోనేరు గట్టుమీద కుంకుమ పూజలు చేయనున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణాల్లో విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ముస్తాబవుతున్న శివాలయాలు

సోంపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలకు శివాలయాలు ముస్తాబవుతున్నాయి. విద్యుత్ దీపాలతో కొత్త కాంతులు సంతరించుకుంటున్నాయి. పట్టణంలోని కాశీవిశ్వేశ్వర, తదితర ఆలయాల్లో భక్తుల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వీర వసంతేశ్వర దేవాలయంలో..

గార, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్వేతగిరిపై వెలసిన వీర వసంతేశ్వర స్వామి వారి దేవాలయ సముదాయాన్ని విద్యుత్తు దీపాలతో అందంగా అలంకరించారు. శివరాత్రి ఉత్సవాలకు వేలాదిగా భక్తులు ఈ ఆలయానికి తరలివస్తారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మహేంద్రడ రవికుమార్, వసుంధర దంపతులు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

● జిల్లాలో 31 పోలింగ్ కేంద్రాలు.. 5,035 మంది ఓటర్లు ● ముగిసిన ఎన్నికల ప్రచారం... అంతటా నిషేధాజ్ఞలు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం సాయంత్రం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'శ్రీకాకుళం జిల్లాలో 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. 5,035 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 3,416 మంది పురుషులు, 1,619 మంది మహిళలు ఉన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశాం. వీల్ చైర్లను సమకూర్చాం. షామియానాలు, తాగునీరు, బయోటాయిలెట్లను ఏర్పాటు చేశాం.

రేపు పోలింగ్..

ఫిబ్రవరి 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఇందుకు సంబంధించి అన్నిరకాల ప్రక్రియలను అధికార యంత్రాంగం ప్రారంభించింది.

నిషేధాజ్ఞలు..

ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ఈనెల 26, 27 తేదీల్లో నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయి. చట్ట వ్యతిరేకంగా గుమిగూడటం, సభలు, ర్యాలీలు నిర్వహించడం వంటి వాటిపై నిషేధం ఉంటుంది. పోలింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుమిగూడరాదని నిషేధాజ్ఞలు జారీచేశాం' అని కలెక్టర్ స్పష్టం చేశారు.

మత్స్యలేశంలో వైసీపీ రాజకీయ చిచ్చు: 'తండేల్' రామారావు


సమావేశంలో మాట్లాడుతున్న రామారావు తదితరులు

శ్రీకాకుళం క్రైం,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కల్మషం లేని మత్స్యకారుల్లో విద్వేషం సృష్టించి.. వారి కుటుంబాల్లో వైసీపీ నాయకులు రాజకీయ చిచ్చు పెడుతున్నారని 'తండేల్' సినిమా కథకు మూలకారకుడైన గనగళ్ల రామారావు విమర్శించారు. స్థానిక ఎన్జీఓహోంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రామారావు, ఆతని భార్య నూకమ్మ మాట్లాడుతూ డి.మత్స్యలేశం గ్రామానికి చెందిన 22 మంది మత్స్యకారుల కష్టాలను 'తండేల్' సినిమాలో చూపించారన్నారు. చిత్ర రచయిత 22 మందితో మాట్లాడారని, అందరికీ రూ.45 వేల చొప్పున ఇచ్చి కథ తీసుకుంటున్నట్లు ఒప్పందం చేసుకున్నారన్నారు. ఒక్క తండేల్ పాత్రనే కీలకంగా చూపిస్తామని ఆ రోజే చెప్పారని వివరించారు. జిల్లా వారికే తెలియని డి.మత్స్యలేశం గ్రామాన్ని ప్రపంచం మొత్తం తెలిసేలా చేశారని అన్నారు. గ్రామంలోని కొంతమంది వైసీపీ నాయకులు సినిమాను రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వైసీపీకి చెందిన మూగి రామారావు, మాగి గురుమూర్తులు మత్స్యకారుల మనసులో విషం నింపి.. సొంత కుటుంబంలో విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. నిర్మాత తనకు రూ.కోటి విలువైన ఇల్లు, రూ.20 లక్షల నగదు, 10 తులాల బంగారం ఇచ్చారంటూ పుకార్లు సృష్టిస్తున్నారని అన్నారు. 22 మంది మత్స్యకారులతో పాటే తమకు రూ.90 వేల చెక్ ఇచ్చారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో సర్పంచ్‌గా తనను పోటీ చేయనీయకుండా ఉంచాలనే ఈ కుట్ర పన్నారని రామారావు ఆరోపించారు. ఈ సమావేశంలో కె.శిరీష, లక్ష్మణరావు, సన్యాసిరావు, మణి, లక్ష్మమ్మ, సీతమ్మ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి రఘువర్మ విజయానికి కృషి


యూనియన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

కవిటి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి పి. రఘువర్మకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. మంగళవారం రామయ్యపుట్టుగలో టీచర్స్ యూనియన్ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. రఘువర్మకు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

విద్యా శాఖ ప్రక్షాళన:ఎమ్మెల్యే

అరసవల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని ప్రక్షాళన చేసే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయిందని విమర్శించారు. అంబేడ్కర్ యూనివర్సిటీలో 60వేల మంది చదువుకునేవారని, కానీ నేడు ఆ సంఖ్య 18 వేలకు పడిపోయిందని విచారం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను ఎన్నో ఇక్కట్లకు గురిచేసిన జీవో నెం.117ను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. కూటమి తరఫు అభ్యర్థి రఘువర్మను గెలిపించాలని కోరారు.

గెలుపు అవసరం

గత వైసీపీ పాలనలో విద్యారంగాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు.. ఉపాధ్యాయులకు తీరని కష్టాలను మిగిల్చారని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు విమర్శించారు. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మెంద దాసునాయుడు, మావిడి వెంకటేష్, కొమ్మనాపల్లి వెంకటరామరాజు, రెడ్డి గిరిజాశంకర్, ఇప్పిలి తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్ పడింది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శ్రీకాకుళం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలో వారం రోజులుగా ఆగిన ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఎట్టకేలకు వెలిగాయి. ఈ నెల 21న 'ఆంధ్రజ్యోతి'లో 'మొరాయిస్తున్న ట్రాఫిక్ సిగ్నల్స్' పేరిట కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. రెండు రోజులుగా విశాఖపట్నం నుంచి నిపుణులను పిలిపించి సీవీ నాగరాజు మరమ్మతులు చేయించారు. దీంతో మంగళవారం రాత్రి ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు వెలిగాయి.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని టౌన్‌హాల్‌లో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి ఫెన్సింగ్ సబ్ జూనియర్స్ బాలుర, బాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చూపిన ముగ్గురిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా ఫెన్సింగ్ సంఘం అధ్యక్షులు బలబద్రుని రాజా తెలిపారు. అండర్-14 బాలుర ఇప్పి కేటగిరిలో శాలిహుండం విశ్వాస్, ఫాయిల్ కేటగిరిలో గొండు ఆదిరామ్, బాలికల విభాగంలో ఫాయిల్ కేటగిరిలో బరాటం వేణిత ఎంపికైనట్లు తెలిపారు.

డీఐజీని కలిసిన ఎస్పీ


డీఐజీ గోపీనాథ్ జెట్టికి మొక్కను అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు విచ్చేసిన విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టిని ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు పూలమొక్కను అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

రణస్థలం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మార్చి 31వ తేదీ వరకు ఆన్‌లైన్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ వి.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20న నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాల కోసం 77024 49892 నెంబరును సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి పనులకు రూ.38 కోట్లు

ఆమదాలవలస, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పొందూరు మండలంలో చేపట్టనున్న 367 అభివృద్ధి పనులకు రూ.38.12 కోట్లు మంజూరైనట్లు మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

విద్యతో మంచి భవిష్యత్తు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చదువుల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయక్ అన్నారు. మంగళవారం పాఠశాలలో టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు బంద్

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి మూతపడ్డాయి. జిల్లాలో ఉన్న 158 మద్యం దుకాణాలు-18 బార్లను ఎక్సైజ్ అధికారులు సీల్ వేశారు. వీటిని తిరిగి 27న సాయంత్రం 4 గంటలకు తెరుస్తారని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి తిరుపతినాయుడు మంగళవారం తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కి ఏర్పాట్లు పూర్తి

- టెక్కలి డివిజన్‌లో 9 కేంద్రాల్లో పోలింగ్
- ఆర్డీవో కృష్ణమూర్తి


మాట్లాడుతున్న ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి

టెక్కలి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 27న (గురువారం) జరగనున్న నేపథ్యంలో డివిజన్‌లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. టెక్కలి డివిజన్‌లో తొమ్మిది పోలింగ్ కేంద్రాల్లో 1,053 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నా రన్నారు. వీటిలో పురుష ఓటర్లు 780 మంది, మహిళా ఓటర్లు 273 మం ది ఉన్నారన్నారు. కొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, ఎల్‌ఎన్‌పేట, సారవకోట, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండల కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కొత్తూరులో 103 మంది, పాతపట్నంలో 270 మంది, మెళియాపుట్టిలో 99 మంది, హిరమండలం లో 70 మంది, ఎల్‌ఎన్‌పేటలో 27 మంది, సారవకోటలో 66 మంది, టెక్కలిలో 254 మంది, సంతబొమ్మాళిలో 52 మంది, కోటబొమ్మాళిలో 112 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికల సామగ్రిని బుధ వారం సిబ్బందికి అందజేయనున్నామన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి పీవో, ఏపీవో స్థాయి ఉద్యోగులతో పాటు పోలీసులు, తహసీల్దార్, వీఆర్వో ఇలా 15 మంది చొప్పున విధుల్లో ఉంటారన్నారు. ఆయా మండ లాల్లో నిర్దేశించిన పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ సిబ్బందిని దించేందుకు, తిరిగి బ్యాలెట్ బాక్సులు తీసుకు వచ్చేందుకు మూడు రూట్లు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచి ఆ తరువాత భారీ భద్రత మధ్య విశాఖ పంపిస్తామన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడం జరిగిందన్నారు. టెక్కలిలోని స్ట్రాంగ్‌రూం వద్ద సీసీ కెమెరాలు, భద్రత ఏర్పాటు చేశామన్నారు.


పలాస: తహసీల్దార్ కల్యాణ చక్రవర్తితో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటేష్

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

పలాస, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను పలాస ఆర్డీవో వెంకటేష్ మంగళవారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ ఓటర్లు ఓటుహక్కు విని యోగించుకునేలా ఏర్పాట్లు చేయాలని, తాగునీరు, చలువ పందిళ్లు వే యాలని ఆదేశించారు. ప్రశాంతంగా ఎన్నికలకు, బందోబస్తు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి, ఎన్నికలడీటీ వి.గిరి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రంలో సదుపాయాలపై ఆరా

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో పోలింగ్ కేంద్రా న్ని మంగళవారం కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు పరిశీలించారు. కేంద్రంలో ఉన్న మౌలిక సదుపాయా లపై హెచ్‌ఎం తారకేశ్వర పండా నుంచి వివరాలు సేకరించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.


వజ్రపుకొత్తూరు: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐ తదితరులు

270 మంది ఉపాధ్యాయులు..

పాతపట్నం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఎంపీడీవో పి.చంద్ర కుమారి, సీఐ వి.రామారావు, ఎస్‌ఐ బి.లావణ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గురువారం నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో 270 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారన్నారు.


పాతపట్నం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్ తదితరులు

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి


అభిరామ్ (ఫైల్)

టెక్కలి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జయకృష్ణాపురం గ్రామానికి చెందిన బెండి అభిరామ్ (18) రోడ్డు ప్రమాదానికి గురై శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. సోమవారం మధ్యాహ్నం అభిరామ్ నందిగాం మండలం పెద్దతామరాపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా హైవేపై లచ్చన్నపేట మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే జిల్లా కేంద్ర ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినా మృతి చెందాడు. ఈ మేరకు టెక్కలి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అభిరామ్ టెక్కలిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఒక్కగా నొక్క కుమారుడు మృతి పట్ల తల్లిదండ్రులు వనజాక్షి, గణేష్‌బాబు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఉపాధ్యాయుడి అరెస్టు

నందిగాం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): దేవుపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన డెప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు కొండాల గోపాలాన్ని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ షేక్ మహ్మద్ అలీ తెలిపారు. ఆదివారం ఆయనపై పోక్సో అట్రాసిటీ కేసు నమోదు కాగా దర్యాప్తు అనంతరం మంగళవారం అరెస్ట్ చేసి టెక్కలి కోర్టులో హాజరుపరిచామన్నారు. అలాగే మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత మహిళను వెంటపడి వేధించినట్లు వచ్చిన ఫిర్యాదులో పోతులూరు గ్రామానికి చెందిన బుట్ట రాంబాబును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 5 టిప్పర్ల స్వాధీనం

జలుమూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) వంశధార నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 5 టిప్పర్లతో పాటు ఒక ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. లింగన్నాయుడుపేట ఇసుక క్వారీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు సోమవారం రాత్రి సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

శ్రీముఖలింగంలో చోరీ

జలుమూరు, ఫిబ్రవరి 25: (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో కాళింగ వీధిలో తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగలు చొరబడి 8 తులాల బంగారం, 8 కేజీల వెండితో పాటు రూ.1.50 లక్షలు నగదు చోరీకి గురైనట్లు బాధితురాలు కాంచనమాల పట్నాయక్ తెలిపారు. వారం రోజుల కిందట కుమార్తె ఇంటికి శ్రీకాకుళం వెళ్లి తిరిగి మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ముందు తలుపులు తీసి ఇంటిలో ఉన్న బీరువా పగులగొట్టి ఉన్నట్లు గుర్తించామన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై హెచ్‌సీ రాజశేఖర్‌ను వివరణ కోరగా ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఎస్ఎంపురం కోదండరామాలయంలో..

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎస్ఎంపురంలోని శ్రీ కోదండరామాలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి 2 కిలోల వెండి ఆభరణాలను అపహరించుకు పోయారని మాజీ సర్పంచ్ చౌదరి అవినాష్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య


తులసి (ఫైల్)

సోంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బారువ కొత్తూరు గ్రామానికి చెందిన వలిశెట్టి తులసి మంగళ వారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడింది. బారువ ఎస్‌ఐ హరిబాబునాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తులసి బట్టిగళ్లూరు పీహెచ్‌సీలో కాంట్రాక్ట్ నర్సుగా పనిచేస్తోంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న తోటి ఉద్యోగి మజ్జి ప్రదీప్ వేధింపులు గురిచేసినట్లు బాధితురాలి తండ్రి హేమరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

టెక్కలి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): టెక్కలి-తెంబూరు రోడ్డు జంక్షన్ వద్ద ఉన్న రైల్వేగేట్ సమీపంలో నౌపడా-గుణుపూర్ వెళ్లే రాజారాణి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి మంగళవారం ఒక వ్యక్తి మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్


శ్రీకాకుళంక్రైం,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలో 12 మద్యం సీసాలు తరలిస్తున్న ఓ వ్యక్తిని మంగళవారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. గార మండలం ఉప్పరపేటకి చెందిన ఓ వ్యక్తి సంచిలో మద్యం సీసాలు తరలిస్తున్నాడన్న సమాచారంతో అతడిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఏఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సాంకేతికతతో సమస్యల పరిష్కారం

(ఐదో పేజీ తరువాయి)

పరిష్కారానికి అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు. ఐవీఆర్ఎస్ కాల్స్ విశ్లేషణ, ఇళ్ల స్థలాల రీ-వెరిఫికేషన్, అభ్యంతరం లేని ఆక్రమణల క్రమబద్ధీకరణ, ల్యాండ్ బ్యాంక్ కేసులు, కోర్టు కేసులు, లోకాయుక్త కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారంపై మాట్లాడారు. ఉపాధిహామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామ సచివాలయాలకు సంబంధించి గత సమావేశంలో చర్చించిన హాజరు, ఇతర సర్వేలపై ఆరా తీశారు. అలాగే చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్య ప్రణాళికా అధికారి కార్యాలయ పరిధిలో ముఖ్యమంత్రి హామీలు, జిల్లాలో అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, డీపీవో భారతి సౌజన్య, వ్యవసాయాధికారి త్రినాథస్వామి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, హౌసింగ్ పీడీ నగేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి



విజయవాడలో బహుమతిని అందుకుంటున్న విద్యార్థులు

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ప్రాజెక్టు లెర్నింగ్ పోటీల్లో సంతబొమ్మాళి ఎంజే పీఏపీబీసీడబ్ల్యూఆర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయిలో పోటీలో బి.హర్షవర్ధన్, బి.నరేష్, టి.హర్షవర్ధన్ తయారు చేసిన 'ఫైండ్ యువర్ వాయిస్' ప్రాజెక్టు ద్వితీయ స్థానం పొందినట్లు ప్రిన్సిపాల్ ఎం.కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, గైడ్ టీచర్ ఎ.సుధ ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా నీలమణి దుర్గ ఆలయ వార్షికోత్సవం


ముర్రాటలు సమర్పించేందుకు వచ్చిన మహిళలు

నందిగాం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నందిగాంలోని నీలమణి దుర్గ (పాతపట్నం అమ్మతల్లి) ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండపారాధన, హోమా లు, కలశ పూజలు చేపట్టారు. మహిళలు ముర్రాటలతో అమ్మవారికి చల్లదనం చేసి మొక్కులు చెల్లిం చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. నందిగాం, పెంటూరు పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో కొండమ్మతల్లికి పూజలు

హిరమండలం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సుభలయ ఆర్‌ఆర్ కాలనీలోని కొండమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రాత్రి భజన కార్యక్రమం చేపట్టారు.

మిత్రుడి కుటుంబానికి సాయం

పలాస, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మిత్రుడు మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు స్నేహితులంతా రూ.1.06 లక్షలు సేకరించి మంగళవారం అందించారు. పలాస హైస్కూల్‌లో 1987-88 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న రమేష్‌పండా ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ఆకుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని ఈమొత్తం ఆయన భార్యకు అందించి భరోసా కల్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొత్తకోట తిరుమలరావు, పూలదాసు శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

4న పీసీఎంఏ ఎన్నికలు


పలాస, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పలాస జీడి పప్పు ఉత్పత్తిదారుల సంఘానికి (పీసీఎంఏ) ఎన్ని కలు నిర్వహించేందుకు కోర్ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నామినేషన్లు స్వీకరించనున్నారు. మార్చి 4వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల కమిటీ సభ్యులు మల్లా భాస్కరరావు, బెల్లాల నారా యణరావు, తర్లాన రమేష్ ప్రకటించారు. ప్రతి రెండేళ్లకోసారి పీసీఎంఏ ఎన్నికలు నిర్వహిస్తారు. దేశంలోనే అతిపెద్ద జీడి పప్పు ఉత్పత్తిదారుల సంఘంగా పలాస పీసీఎంఏకు గుర్తింపు ఉంది. ఈ ఎన్నికల్లో ప్రస్తుత సభ్యులతో పాటు మరికొందరు కొత్త సభ్యులు పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ఎన్నికల్లో పోటీకి అనేక మంది ముందుకు వస్తున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న ఎంవీఐ గంగాధర్

పలాసరూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ఎంవీఐ పీవీ గంగాధర్ అన్నారు. రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో మంగళవారం 'విద్యార్థులు-రోడ్డు భద్రత'పై విద్యార్థులకు అవగాహన కలిగించారు. 18 ఏళ్లు దాటిన వారు మాత్రమే వాహనాలు నడ పాలన్నారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

గురువులకు పాదపూజ


తల్లిదండ్రులు, గురువుల ఆశీస్సులు తీసుకుంటున్న విద్యార్థులు

జలుమూరు (సారవకోట), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చిన్నకిట్టాలపాడు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పాతపట్నం రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పారశెల్లి రామరాజు స్టడీ మెటీ రియల్‌ను మంగళవారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం అగతముడి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమంలో స్టడీ మెటీరియల్, పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా గురువులకు తల్లిదండ్రులకు విద్యార్థులు పాదపూజ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎంవీరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు: జేసీ


సూచనలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

జలుమూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆలయ అధికారులకు సూచించారు. మంగళవారం శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాలను పాటించాలని స్పష్టం చేశారు. ప్రత్యేక క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని, తాగునీటి వసతి, నీడ సౌకర్యం కల్పించాలని తెలిపారు. వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలరేవును పరిశీలించి.. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ ఎం.లావణ్య, ఆర్డీవో కె.సాయిప్రత్యూష, తహసీల్దారు జె.రామారావు, ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, సర్పంచ్ తమ్మన్నగారి సతీష్‌కుమార్, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రఘువర్మను గెలిపిద్దాం: ఎమ్మెల్యే మామిడి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పాకలపాటి రఘువర్మను గెలిపించుకుందామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో నాయకులతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహిం చారు. ఉపాధ్యాయుల ఆశీస్సులతో కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఇప్పుడు జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులంతా రఘువర్మను మరోసారి గెలిపించాలని, ఈ దిశగా కూటమి నేతలు కృషిచేయాలని కోరారు.

చక్కని ప్రణాళికతో ఉజ్వల భవిష్యత్


భూలోకంలో యమలోకం నాటిక ప్రదర్శన

పలాసరూరల్,ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): చక్కని ప్రణాళికతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని, ఈ దిశలో కాలయాపన చేయకుండా పరీక్షలకు సిద్ధం కావాలని ఉపాధ్యాయులు సూచించారు. బ్రాహ్మణ తర్లా జడ్పీ హైస్కూల్ ప్లస్ కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భూలోకంలో యమలోకం నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీర్రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత చదువులు చదువుకోవాలి


డ్యాన్స్ చేస్తున్న బాలికలు

పోలాకి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పిస్తున్నందున వస తి గృహాల్లో ఉండి ఉన్నత చదువులు చదువుకోవాలని గంగివలస కేజీబీవీ సంక్షేమాధికారి జి.శారద సూచించారు. మంగళవారం పాఠశాల పదో తరగతి విద్యార్థినుల వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సంద ర్భంగా బాలికలు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పుస్తక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోండి


విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కొత్తూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు పుస్తక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈవో శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల వార్షికో త్సవం మంగళవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో-2 గోవిందరావు, హెచ్‌ఎం ఎ.గోవిందరావు, పారాపురం సర్పంచ్ కుంచాల రత్నాలు, మాతల గాంధి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనే రాణించాలని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. క్రమశిక్షణతో కూడిన విద్య భవిష్యత్‌కు బాటలు వేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో-2 గొల్లవాడు, హెచ్‌ఎం టి.కేశవరావు, విద్యా కమిటీ చైర్మన్ ఎస్.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత చికెన్, ఎగ్ మేళా

టెక్కలి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో మంగళవారం ఉచిత చికెన్, ఎగ్ మేళాను స్థానిక పట్టు మహాదేవి కోనేరు గట్టుపై ఏర్పాటు చేశారు. చికెన్ లెగ్‌పీస్, లాలీపాప్, చికెన్ పకోడి, ఉడకబెట్టిన గుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. చికెన్ తింటే బర్డ్‌ఫ్లూ వస్తుందనే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ఈ మేళాను ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

- హిరమండలం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కోళ్లలో వ్యాపించిన బర్డ్‌ఫ్లూ వాధి కారణంగా ప్రజలు చికెన్ తినేందుకు భయపడుతున్న నేపథ్యంలో ఎటువంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని అవగా హన కలిగించారు. ఓ ప్రైవేటు కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా చికెన్ పంపిణీ చేశారు. చికెన్ పకోడీ, ఉడికించిన గుడ్లను అందజేశారు.

న్యూస్ బాక్స్

శ్మశానవాటిక ఆక్రమణల తొలగింపు

హరిపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): హరిపురంలోని పాత జాతీయరహదారి పక్కనే ఉన్న శ్మశానవాటికను మంగళ వారం సర్వేయర్ బాలరాజు సర్వే చేసి ఆక్రమణలు తొలగించారు. గ్రామస్థుల సహకారంతో ప్రహరీ నిర్మించి ఆక్రమణలకు గురికాకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బైరిశెట్టి గున్నయ్య, పుల్లా వాసు, రౌతు చిరంజీవిరావు, ఏర్పుల జోగారావు, వెంకట్రావు, కె.తేజ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

జలుమూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): లింగాలవలస గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. 29వ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పురోహితులు పురిపండా వెంకటరమణ నేతృత్వంలో కొరపాక రమేష్ ఆచారి దంపతులు వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమ్మల కల్యాణం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దుంగ స్వామిబాబు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు బందోబస్తు

టెక్కలి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రావివలస ఎండలమల్లికార్జునస్వామి దేవస్థానంలో బుధవారం జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు పోలీస్ శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఈ ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఒక సీఐ, ఎస్‌తో పాటు 13మంది ఏఎస్‌ఐలు, హెచ్‌సీలు, 19 మంది కానిస్టేబుళ్లు, ఐదుగురు మహిళా కానిస్టేబుళ్లు, పదిమంది హోంగార్డులు, తొమ్మిది మంది ఎస్‌టీఎఫ్ పార్టీ విధులు నిర్వహించనున్నారు.

మద్యం షాపుల మూసివేత

టెక్కలి/నరసన్నపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం టెక్కలి, నరసన్నపేటల్లో మద్యం షాపులను మూసివేశారు. సీఐ రమణమూర్తి, ఎస్‌ఐలు ఎం.వేణు, గురుమూర్తి ఆధ్వర్యంలో మూసివేశారు. ఈనెల 27న సాయంత్రం షాపులు తెరుచుకో నున్నాయి.

పేదలకు ఇళ్లను కట్టించి ఇవ్వాలి

పలాస, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సూదికొండ కాలనీలో పేదలకు చెందిన ఇళ్లను నేలమట్టం చేయడం సరికాదని, వారందరికి స్థలాలు కేటాయించి గృహాలను నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ డిమాండ్ చేశారు. సీపీఐ బృందం సూదికొండ కాలనీలో మంగళవారం పర్యటించింది. నాయకులు వేణుగోపాల్‌గోపి, కుమార్ పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని వెలికితీయాలి

పోలాకి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని, దీనికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని ఎంఈవో బి.శ్రీనివాస నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మండలస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. వైజ్ఞానిక ప్రదర్శన నిర్వాహకుడు మెట్ట జనార్దనరావు, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

విద్యార్థుల్లో చైతన్యం నింపాలి

నందిగాం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రీ స్కూల్ విద్యార్థుల్లో మానసిక చైతన్యం నింపాలని సర్వశిక్ష అభియాన్ ఏపీసీ శశిభూషణరావు అన్నారు. నందిగాం అంబేడ్కర్ బాలికల గురుకులంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులను మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల్లో ప్రేరణ కలిగేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నా రావు, డీఆర్పీలు టి.నారాయణరావు, టి. కుమారస్వామి, విశాఖరావు, జలజాక్షి పాల్గొన్నారు.